# నీళ్ళు

"దీన్నిండా తప్పులే... మళ్ళీ వ్రాసుకురా... నీకు తెలియకపోతే నీ సీనియర్‌ని కన్సల్టు చెయ్యి. మరో అర గంటలో యిది కావాలి..." అన్నాడు ఆఫీసరు, జోగినాథం అంతకుముందు తయారుచేసిన డ్రాఫ్టు మళ్ళీ అతని చేతికి అందిస్తూ.

జోగినాథం వినయంగా "అలాగేనండీ" అంటూ ఆ కాగితం అందుకున్నాడు. గది దాటి యివతలికి వచ్చేసరికి అక్కడే లోపలికి వెళ్ళేందుకు కాబోలు నిరీక్షిస్తూ నిలబడి వున్న కుసుమ అతనికి కనిపించింది. ఆమె ఆఫీసరుగారి మాటలు వినేవుండాలి. అందుకు నిదర్శనం ఆమె అతనివంక చూసి నవ్విన నవ్వు.

ఉమాపతి తన సీటులో తీరికగా కూర్చునివుండి కళ్ళెగరవేసి "ఆ కాగితం మళ్ళీ నీ చేతుల్లోకే వచ్చిందేమిటయ్యా మహానుభావా?" అని అడిగాడు.

జోగినాథం మొహం తుడుచుకుని సిగ్గుపడుతూ "దీన్నిండా తప్పులున్నాయిట... ... మళ్ళీ రాసుకురమ్మన్నారు" అని చెప్పాడు.

ప్రక్కనే కూర్చుని ఏదో ఫైలు తిరగవేస్తున్న లక్ష్మీపతి తలయెత్తి చూసి "ఉద్యోగంలో చేరి నెలా పదిహేను రోజులేకదా అయింది? ఏవో చిన్న చిన్న తప్పులుంటే తాను దిద్ది టైపిస్టు కివ్వగూడదూ? అంతా హోషులే బ్రదర్... ఆ కుర్చీ అలువంటిది" అన్నాడు.

ఉమాపతి "సరే ... ఇక నేం? ఆ కాయితం యిలా తీసుకురా... గబగబా ఏదో గిలికి యిచ్చి త్వరగా బయట పడిపోదాం...అన్నట్టు యివాళ సినిమా ప్రోగ్రాం కూడా ఉంది" అన్నాడు.

జోగినాథం ఆ కాయితం ఉమాపతికి అందించి అతని ముందు కుర్చీలో కూర్చుని "మీ యిద్దరూ సినిమాకు వెడుతున్నారా?" అని అడిగాడు.

ఉమాపతి లక్ష్మీపతివంక చూశాడు. లక్ష్మీపతికూడా ఆ ప్రశ్న విని జోగినాథంవైపు చూశాడు. అతడు విసుగుతో జోగినాథాన్ని ఉద్దేశించి "నీ ప్రవర్తన నాకేం నచ్చడంలేదోయ్ ... మనం ముగ్గురం ఒకే రూములో ఉంటూ ఒకే హోటల్లో భోజనం చేస్తున్నాము...అయినా నువ్వు అదేమిటో అంటే అంటనట్టు ప్రవర్తిస్తూవుంటావు. మొన్న నొకసారి కూడా యిలాగే సినిమాకు పోదాం రమ్మంటే రానంటే రాను పొమ్మన్నావు. అలా స్నేహపూర్వకంగా

అడిగినప్పుడు మొహంమీద కొట్టినట్టు కాను పొమ్మంటే ఎలా వుంటుందో ఆలోచించావా ?" అన్నాడు.

ఉమాపతి "ఎందుకులే బ్రదర్ ! అతని తీరు తెలిసి వచ్చింది కదా ! ఇక యేమీ మాట్లాడక వూరుకో" అని తాను పనిలో మునిగిపోయాడు.

జోగినాథం యిరుకున పడ్డాడు. అతి కష్టంమీద గొంతు పెగుల్చుకుని "క్షమించండి" అనగలిగాడు. ఉమాపతి వినిపించుకున్నట్టులేదు.

మరో అయిదు నిముషాల్లో ఉమాపతి తాను తయారు చేసిన కొత్త డ్రాఫ్టు జోగినాథం ముందుపడేసి లేచినుంచుని జేబులు సర్దుకుని లక్ష్మీపతి నుద్దేశించి "త్వరగా తెమల వోయ్" అన్నాడు. లక్ష్మీపతి ఫైలు మడిచి అవతలపడేసి "నేను సిద్ధమే" అంటూ లేచి మళ్ళీ జోగినాథంవంక చూసి "మరి యీయనగారి మాటేమిటి ?" అని అడిగాడు. ఉమాపతి జేబుల్లో చేతులుంచుకుని జోగినాథంవంక తిరిగి "ఏమంటావు ?" అని అన్నాడు.

అతడు కాయితం మడతపెడుతూ లేచినుంచుని "నేనెందుకు లెండి బాబూ ! మీరిద్దరూ వెళ్ళిరండి. నేను రూములో నేవుంటాను." అన్నాడు.

ఉమాపతి కొద్దిగా కోపం తెచ్చుకుని అడుగులు ముందుకువేశాడు. లక్ష్మీపతి సీటులో నుంచి లేచి యివతలికి వస్తూ "ఏం ? మాతో రావడం యిష్టంలేదా నీకు ?" అని అడిగాడు.

జోగినాథం నీళ్ళు నములుతూ "పతీ! నాదగ్గర డబ్బు..." అంటూ ఆగిపోయాడు.

అంతలోనే అందుకుని లక్ష్మీపతి "భలేవాడివే జోగినాథం! నీదగ్గర డబ్బు వుంటేమటుకు నిన్ను టిక్కెట్లు కొననిస్తామా? మరేమిటో అనుకున్నాను. అదా నీ సందేహం? ఊఁ! ఇకనైనా బయలుదేరు. డబ్బు మాదగ్గర వుందిలే..." అన్నాడు.

జోగినాథం "అది కాదండీ బాబూ! మీకెలా చెప్పాలో అర్థంకావడంలేదు. నేను రానుగాని, నన్ను విసిగించక మీరు వెళ్ళిరండి..." అన్నాడు విసుగుతో.

ఉమాపతి నిష్ఠూరమాడుతూ "అదయ్యా సంగతి... డబ్బునుగురించి ఎంతమాత్రం కాదు. కేవలం 'యీ జులాయి వెధవలతో ఎందుకు తిరగాలీ'...అని అతని బాధ. అతను బుద్ధిమంతుడు. జాగ్రత్తపరుడు. సినిమాలూ షికార్లూ అతనికి గిట్టవు. కాబట్టి యికమీదటనైనా మనం అతన్ని పిలిచి అవమానం చెందనక్కరలేదు. అర్థమయిందా? పోదాంపద." అన్నాడు.

లక్ష్మీపతి "అదీ నిజమే. ఇవాళ మనం సినిమాకు తీసుకువెడతామంటే వెంటనేవస్తే......మళ్ళీ తనెప్పుడైనా ఆమాట అనవలసివస్తుందేమోనని దిగులుకూడా ననుకుంటాను." అంటూ జేబులోంచి తాళంచెవులు తీసి బల్లమీదకి విసిరి "అయ్యా! జోగినాథంగారూ, యివిగో రూము తాళాలు... మేము వెళ్లొస్తాం..." అన్నాడు.

మరుక్షణంలో వారిద్దరూ చేతులు కలుపుకుని బయటికి వెళ్ళిపోయారు. జోగినాథం మనస్సు చివుక్కుమన్నది. లక్ష్మీపతి యెంత మాట అన్నాడు! తమతో కలసి సినిమాలకూ షికార్లకూ రానంత మాత్రంలో అంత మాట అనడమేనా?

* * * *

అతడు చుట్టూ చూశాడు. అప్పటికే అంతవరకూ అక్కడవున్న యితర గుమాస్తాలుకూడా వెళ్ళిపోయారు. మూలగా కుసుమ ఒక్కతే మాత్రం తన సీటులో కూర్చుని యేదో కాయితం టైపు చేస్తున్నది. జోగినాథం వుండి వుండి ఆమెవైపు చూస్తూ ఆఫీసరు గదిలోనుంచి పిలుపుకోసం ఎదురు చూస్తున్నాడు.

అంతలో అతనికి దూరంగా కిటికీలో ఎత్తుగా ఉంచబడిన నీళ్ళకూజా కనిపించింది. నీళ్లు మరింత చల్లగా వుండటంకోసం దానిచుట్టూ జనపనార తాడు అల్లివుంచారు. దానిపక్కనే రెండు గాజు గ్లాసులున్నాయి.

జోగినాథం నెమ్మదిగా లేచివెళ్ళి శుభ్రంగా తళతళలాడుతున్న గ్లాసును చేతిలోకి తీసుకుని దాన్ని నీళ్ళతోనింపి చెయ్యి పైకెత్తి ఒక్కనిముషంసేపు దానివంక కన్నార్పకుండా చూశాడు. గ్లాసులో నీళ్లు తెల్లగా మిలమిల లాడుతున్నాయి. అటువైపునుంచి ప్రసరిస్తున్న వెలుగు కిరణాలవల్ల అవి క్షణక్షణానికీ మరింత మెరిసిపోతున్నాయి. అతడు నెమ్మదిగా ఆ గ్లాసు నోటిదగ్గర వుంచుకుని గుక్క తర్వాత

గుక్కగా నింపాదిగా తాగాడు. తర్వాత గ్లాసు అక్కడ వుంచి మూతి తుడుచుకుంటూ తలతిప్పి చూసేసరికి తనవంక నే కన్నార్పకుండా చూస్తున్న కుసుమ కనిపించింది. అతడు సిగ్గు పడిపోయి త్వరత్వరగా తన సీటులోకి వెళ్ళి కూర్చున్నాడు. కుసుమ అంతవరకూ యీతంతు అంతా తనపని ఆపుకుని మరీ చూసింది కాబోలు. అతడు కుర్చీలో కూర్చోగానే మళ్ళీ టైపుశబ్దం ప్రారంభమైంది.

కొద్ది నిముషాల తర్వాత ఆఫీసరుగారి గదిలో బెల్ మ్రోగింది. కుసుమ గబగబా లేచి లోపలికి వెళ్ళి మళ్ళీ వెంటనే తిరిగివచ్చి జోగినాథంతో "మిమ్మల్ని పిలుస్తు న్నారు." అన్నది.

జోగినాథం కాయితం చేతిలోకి తీసుకుని ఒక్క ఉదు టున లేచివెళ్ళి ఆఫీసరుగారి ముందు నిలబడ్డాడు. ఆయన అతని చేతిలో కాయితం తీసుకుని చూసి తలఎత్తి "ఊఁ! ఎవరిని కన్సల్టు చేశావు?" అని అడిగాడు.

జోగినాథం నెమ్మదిగా "ఉమాపతి వ్రాసి యిచ్చా డండీ." అని చెప్పాడు.

ఆయన చురుకుగా చూసి "అలాగా? చూడు జోగి నాథం! నువ్వు అలా ఉన్న విషయం చెప్పినందుకు నాకు చాలా సంతోషంగావుంది. కాని ఒక్క సంగతి గుర్తు పెట్టుకో. అతను గ్రాడ్యుయేటు. పైగా అనుభవం ఉన్న వాడు. అతనీనాడు నీకు స్నేహితుడు కాబట్టి సహాయం చెయ్యడం బాగానేవుంది. కానీ ఎన్నాళ్ళిలా? నువ్వు కొత్త

వాడివి. పైగా నీకు చదువూ తక్కువే. అయినా నువ్వు కొంచెం చొరవ తీసుకుని పనిలో అభివృద్ధిచూపించాలి. వారిమీదా వీరిమీదా కొత్తల్లో ఆధారపడటం తప్పేమీ కాదు. వాళ్ళు సహాయం చెయ్యటమూ తప్పుకాదు. కాని నువ్వు కూడా స్వతంత్రించి కొంచెం యింప్రువ్‌మెంట్ సాధించాలి. నాలుగు వాక్యాలు స్వంతంగా తప్పులులేకుండా వ్రాయడం బ్రహ్మవిద్యేమీకాదు. సరే... నువ్వెళ్ళు... ఆ టైపిస్టును రమ్మని చెప్పు... ఈ కాయితం యివాళ వెళ్ళి పోవాలి..." అన్నాడు.

జోగినాధం తలవూపి యివతలికివచ్చి కుసుమ నుద్దేశించి "మిమ్మల్ని పిలుస్తున్నారండీ..." అని చెప్పాడు. ఆమె లేచి ఆఫీసరు గదిలోకి వెళ్ళింది.

జోగినాధం టైపు మెషీను దగ్గర నిలబడ్డాడు. కన్నార్పకుండా దానివంకనే చూశాడు. కుసుమ లోపల ఆఫీసరుగారి గదిలో "అలాగేనండీ... యిప్పుడే చేసియిస్తాను." అంటున్నది.

అతడు టైపుమెషీను దగ్గరగా జరిగి ఒకవిధమైన చాపల్యంతో వ్రేలు కదిపి ఒకమీట నొక్కాడు. లోపల కాయితం చుట్టివున్న సిలిండరు 'ధన్'మని పెద్దశబ్దం చేస్తూ మరో వైపుకు కదిలింది. అతడు అదిరిపడ్డాడు.

అంతలో కుసుమ చేతిలో కాయితంతో వచ్చి "అదేమిటి? "టాబ్యులేటర్" నొక్కారా? అలాచేస్తే మెషీను పాడైపోతుంది. మీరిలా కూర్చోండి... మీ కాయితమే

యిది. ఇప్పుడే ఆఫీసరుగారికి అందించాలి.. ఆ తర్వాత యిద్దరం కలిసే వెడదాం..." అంటూ కూర్చుని తనపనిలో నిమగ్నురాలయింది. జోగినాథం "అలాగేనండీ" అంటూ తలవూపి ఒక కుర్చీలో కూర్చున్నాడు. అతనితో కుసుమ యిదే మొదటిసారి మాట్లాడటం.

జోగినాథం కనురెప్పపాటు అయినా లేకుండా చూస్తూ కూర్చున్నాడు. అతనికి కుసుమ నైపుణ్యం అబ్బురం కలిగించింది. ఆమె పలుచని బంగారురంగు ౘ్రేళ్ళు టైపు మెషీను మీద వేగంగా అందంగా కదులుతున్నాయి. ఆ ౘ్రేళ్ళలో ఏదో మంత్రశక్తి ఉన్నట్లు అనిపించిందతనికి. తాను పుట్టి నప్పటినుంచీ పద్దెనిమిదేళ్ళ వరకూ— అంటే స్కూలుఫైనల్ ప్యాసయ్యే వరకూ— ఉన్నది గుంటూరుజిల్లాలో ఒకమూరు మూల పల్లెటూళ్లో. తాను ఎనిమిదవ తరగతి వరకూ చదువు కున్నది పక్కవూరిలోని మిడిల్‌స్కూల్లో. ఆ వూరు కూడా పెద్దదేమీకాదు. తన మిడిల్‌స్కూల్ చదువు పూర్తికాగానే తన తల్లి యిక చదువు మానుకోమన్నది. కాని, ఆ సంవత్సరం నుంచి స్కూల్‌ఫైనల్ వరకూ పై తరగతులుకూడా ఏర్పాటు చేసి ఆ స్కూల్‌ను హైస్కూలుగా మార్చారు. ఆ సదుపాయం రావడంతో అతని తల్లి మనసుమార్చుకుని 'ఊరువిడిచి ఎక్కడికీ పోనక్కరలేదుకదా' అనే ఆలోచనతో మళ్ళీ ఫోర్తు ఫారంలో చేరమన్నది. ఆ విధంగా అతడు, రెండు నెలల క్రిందట యీ ఉద్యోగం వచ్చేవరకూ, రైలుప్రయాణం కూడా ఎన్నడూ చేయలేదు. ఇప్పుడు మెషీను ముందు

కూర్చుని 'చకచక' టైపు చేస్తున్న కుసుమను చూస్తూ వుంటే ఎంతో గొప్పగా వింతగా వుంది.

ఆమె ఆ కాయితం పూర్తిచేసి ఆఫీసరు గదిలోకి వెళ్ళింది. జోగినాథం లేచి మంచినీళ్ళ కూజా దగ్గరికి వెళ్ళి మూతతీసి లోపలి నీళ్ళవంక ఒక్క—క్షణం చూశాడు. అలా చూస్తూ వుండగానే-తన వూరిలో తన చిన్న చెల్లెలు దాహంతో బాధపడుతూ కూర్చునివుంది. ఎండ నిప్పులు చెరుగుతున్నది. వెచ్చనిగాలి రివ్వున వీస్తున్నది. ఇంటి ముందు బయట ప్రదేశంలో దూరంగా సుడిగాలి గిర్రున తిరుగుతున్నది. తన తల్లి సగం మాత్రమే నిండిన బిందెను భుజాన పెట్టుకుని ఎండలో యింటికి నడిచి వస్తున్నది. అన్నంతింటూ కూడా నీళ్ళను పొదుపుగా వాడుకోవాలి అక్కడ... స్నానం చేసేందుకు సరేసరి... ఆ ఉప్పని నీళ్ళకుకూడా కేపనింగే— అతని కళ్లు చెమర్చాయి. వెంటనే గ్లాసు నీళ్ళతో నింపుకుని గడ గడ త్రాగాడు.

తర్వాత వెనుదిరిగి చూసేసరికి ఎంతసేపటి నుంచీ తనను గమనిస్తున్నదో కుసుమ— అక్కడే చేతులు కట్టుకుని నిలబడివుంది. ఆమె హఠాత్తుగా అతని చేతివంక చూసి "అరె! మీ చేతికి ఆర్రువేళ్ళున్నాయే!" అన్నది ఆశ్చర్యంగా.

జోగినాథం తన ఎడమ చేతిని చూసుకుని నవ్వాడు.

కుసుమ "రండి... అయిదున్నర దాటింది... ఇళ్ళకు చేరుకుందాం..." అంటూ దారితీసింది.

జోగినాథం ఆమె ననుసరించి మెట్లు దిగుతూవుండగా ఆమె మళ్ళీ "చేతికి ఆరు వేళ్ళుంటే అదృష్టం అని అంటారే నిజమేనా అండీ?" అని అడిగింది. అతడు నిట్టూర్చి "ఆఁ! ఏం అదృష్టమో!" అన్నాడు.

ఇద్దరూ మెట్లు దిగి వీధిలోకి వచ్చి నడవటం ప్రారంభించారు. పేవ్‌మెంట్ మీద జోగినాథం కుసుమ పక్కగా నడుస్తున్నాడు. అతనికిది పూర్తిగా కొత్తఅనుభవం... అతనికిప్పుడు పందొమ్మిదో యేడు. ఇంత వరకూ అతడు పధ్నాలుగేళ్ళ తన చెల్లెలితోతప్ప పరాయి ఆడపిల్లతో ఎన్నడూ మాట్లాడి ఎరుగడు. ఇప్పుడు కుసుమ వంటి అందమయినదీ, నాగరికురాలూ అయిన పడుచువెంట నడవటం అతనికి చాలా యిబ్బందిగానేవున్నా ఒక వింత ఆనందాన్ని కూడా యిస్తున్నదని చెప్పకతప్పదు.

ఆమె నడుస్తూనే "ఏమండీ! ఇందాక పతిద్వయం మీమీద అలిగి వెళ్ళినట్టున్నారే!..." అన్నది.

"అవునండీ! పోయినవారంలో కూడా ఒకసారి యిలాగే జరిగింది. వాళ్ళిద్దరూ సినిమాలకూ, సర్కసులకూ పోతూ నన్నుకూడా రమ్మంటారు. నాదగ్గర వాటన్నిటికీ డబ్బెక్కడవుంటుంది చెప్పండి?... మా వూళ్ళో యింటిదగ్గర మా అమ్మా, యిద్దరు చెల్లెళ్ళూ వున్నారు. పెద్ద చెల్లెలికి పధ్నాలుగేళ్ళు... దానికి పెళ్ళి కావలసివుంది... చిన్న చెల్లెలు ఆరేళ్ళది... మాకు ఆస్తిపాస్తులేవీ లేవు. పైగా మా వూళ్ళ సంగతి తెలుసుగా మీకు? అక్కడ మంచినీళ్ళు

కూడా 'బిందె యింత' అని కొనుక్కోవాలి... అందువల్ల నేను జీతం అందుకోగానే నాకోసం అతి తక్కువ డబ్బు వుంచుకుని మిగిలినదంతా అక్కడికి పంపుతాను. అలాంటప్పుడు నాకు వీళ్ళతో తిరగడం ఎలా సాధ్యపడుతుంది చెప్పండి..." అంటూ ఆగాడు జోగినాథం. కుసుమ జాలిగా అతనివంక చూసింది.

అతడు మళ్ళీ "నాదగ్గర డబ్బు ఉండదని తెలిసికూడా నన్ను తమతోరమ్మని బలవంతం చేస్తారు. అన్నిటికీ తము డబ్బు పెట్టుకుంటామంటారు. అదినాకు బొత్తిగా యిష్టం వుండదు. అలా అని చెబితే వాళ్ళకు కోపం పొడుచుకొచ్చేస్తుంది..." అన్నాడు.

కుసుమ నవ్వి "బాగానేవుంది..." అన్నది.

జోగినాథం "మీరెప్పుడూ మా ప్రాంతాలకు రాలేదు కదండీ. అక్కడ నీటిచుక్క కనిపించదు. అన్ని కాలాల్లోనూ ఒకటే కరువు. బావులన్నీ పాతాళంలోకి వెళ్ళే సొరంగాల్లాగా వుంటాయి. తొంగిచూస్తే అడుగున ఏమీ కనిపించదు. పెద్దతాడు బొక్కెనకు కట్టి లోపలికి వొదులుతూ వుంటే ఎంతకూ నీళ్ళు తగలవు. చివరకు బొక్కెన రాళ్ళమీద పడిన శబ్దం వినిపిస్తుంది. ఇక నీళ్ళు ఎక్కడో చిన్ని గుంటలా కొద్దిగా వుంటాయి.. బొక్కెనను అక్కడికి జరిపి నీళ్లు రాబట్టుకోవాలి... మా ప్రాంతలలో బొక్కెనలెలా వుంటాయో తెలుసా మీకు? కిరసనాయిలు డబ్బాలుంటాయి చూశారూ. వాటిని సగానికి తెగగొట్టి అతుకు

వేసి నీళ్ళను ఊడ్చుకు వచ్చేందుకు వీలుగా తయారుచేస్తారు. మధ్యాహ్నంపూట సూర్యుడు నడినెత్తిమీద వున్నప్పుడు మాత్రం బావిలోపల ఎక్కడో నీళ్ళు తళతళ లాడుతూ కొంచెంగా కనిపిస్తాయి. అందరూ రాత్రివేళల్లో వెళ్ళి మరునాటికి కావలసిన నీళ్ళు తెచ్చుకోవలసిందే. తెల్లవారితే జల ఉండదు... చుక్క కూడా మిగలదన్నమాట..." అంటూ ఆగి మళ్ళీ నిట్టూర్చి "అందుకే నాకు మావూరంటే బొత్తిగా యిష్టంలేదు... మావాళ్ళను కూడా యిక్కడికి తీసుకు వొచ్చేద్దా మనిపిస్తూవుంటుంది అప్పుడప్పుడు... అయినా నాకిక్కడ వొచ్చేది చాలనొద్దూ..." అన్నాడు.

కుసుమ అతడు చెప్పినదంతా కళ్ళు పెద్దవి చేసుకుని ఆశ్చర్యంగా విన్నది. అతడు మళ్ళీ "రెణ్ణెల్ల క్రిందట నేను ఉద్యోగంలో జాయినయేందుకు వచ్చేటప్పుడు రైలు కృష్ణా నదిమీదినుంచి పరుగెత్తుతూ వుండగా చూసి ఆశ్చర్యంతో బొమ్మలా అయిపోయాను. మీరు నమ్మరేమో! అన్ని నీళ్ళు ఒక్కచోట చూడటం అదేనాకు మొదటిసారి... చిన్నప్పుడెప్పుడో సముద్రం చూశానుగాని అవి ఉప్పునీళ్ళు కదా! ఇంత నదీ, యిన్ని నీళ్ళూ వున్నప్రాంతం సంపన్నం కాకుండా ఎలా వుంటుంది చెప్పండి? నీళ్ళు పుష్కలంగా వున్నచోటే నాగరికత... మా ప్రాంతాలలో మనుషులు వొంటినిండా పోసుకునేందుకూ కడుపునిండా తాగేందుకూ పుష్కలంగా నీళ్ళులేకనే చిక్కిపోతున్నారని నాకప్పుడప్పుడు అనిపిస్తూ వుంటుంది. ఇక్కడ నాకు చాలా హాయిగావుంది.

రోజూ ఉదయం లేచీలేవగానే కృష్ణకువెళ్ళి స్నానం చేస్తాను. సాయంకాలం ఆఫీసునుంచి వెళ్ళీ వెళ్ళగానే బావిదగ్గర మళ్ళీ స్నానం చేస్తాను. ఇప్పుడెంతో హాయిగా ఆరోగ్యంగా వున్నాను... అంతా నీళ్ళలోనేవుంది సుమండీ..." అని ఒక్కక్షణంఆగి "నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తి అయితే మాకూ నీళ్ళకరువు తప్పుతుందనీ, మెట్టపొలాలన్నీ మాగాణి భూములవుతాయనీ అనుకుంటున్నారు. అది ఎప్పటికో..." అన్నాడు నిట్టూర్చి.

కుసుమ నవ్వి "అయితే మీ నిర్వచనం ప్రకారం నీళ్ళే నాగరికతకూ సౌభాగ్యానికీ మూలకారణం అన్న మాట..." అన్నది.

జోగినాథం తలవూపుతూ "అంతేనండీ... నిస్సందేహంగా. అందులో మీకేమీ అనుమానం అక్కర్లేదు... అది కరెక్ట్..." అన్నాడు... కుసుమ ఆ మాటలు విని మళ్ళీ నవ్వింది.

అప్పటికి వారు చాలా దూరం నడిచివచ్చారు. కుసుమ ఒకచోట ఆగి "ఇదే మాయిల్లు... రండి... ఒక్క నిముషం కూర్చుని పోదురుగాని..." అన్నది.

జోగినాథం "ఎందుకులెండి... యిప్పుడు.." అంటూ ఏదో చెప్పబోయి ఆమెవంకచూసి ఆగి "సరే పదండి..." అన్నాడు. ఆమె నవ్వుతూ మెట్లెక్కి తలుపుతట్టి "మా అన్నయ్య యింట్లోనే వున్నాడనుకుంటాను... మిమ్మల్ని పరిచయంచేస్తాను..." అన్నది.

ఆరేళ్ళ పలుచని ఎర్రతేలువంటి పిల్ల తలుపు తెరిచి లోపలికి వెడుతూ "అక్కయ్య వొచ్చింది.." అంటూ రాగం తీసింది. కుసుమా, జోగినాథం గుమ్మం లోపలికి వెళ్ళేసరికి కిటికీ పక్కగావున్న కుర్చీల్లో ఒకదాన్లో ఎవరో కూర్చుని పేపరు చూస్తున్నారు. కుసుమ అటుతిరిగి "అన్నయ్యా! నువ్వెంతసేపయింది వచ్చి?" అని అడిగింది. ఆ వ్యక్తి పేపరు తప్పించి "ఇప్పుడే... పది నిముషాలయి వుంటుందేమో..." అంటూ జోగినాథంవంక చూశాడు. కుసుమ "వీరు మా ఆఫీసులో పనిచేస్తున్నారు.. మిస్టర్ నాథ్ గారు. ఈయన మా అన్నయ్య కామేశం... ఇక్కడ కాలేజీలో లెక్చరర్..." అని ఒకరినొకరికి పరిచయంచేసి "మీరు కూర్చుని మాట్లాడుకుంటూ వుండండి.. నే నిప్పుడే అయిదు నిముషాల్లో కాఫీలు పట్టుకొచ్చేస్తాను" అంటూ లోపలికి వెళ్ళింది.

ఆ యిద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. ఆయనకు యిరవై అయిదేళ్ళకు మించి వుండదు వయస్సు. సన్నగా, ఎర్రగా వున్నాడు. కళ్ళకొక రిమ్‌లెస్ జోడువుంది. ధరించిన దుస్తులు చాలా నాగరికమైనవీ, ఖరీదైనవీనూ.. ఆయన పేపరు పక్కనవుంచి జోగినాథం ఉద్యోగాన్ని గురించీ, అతని చదువును గురించీ ఏవేవో ప్రశ్నలు వేశాడు.

కొద్ది నిముషాల్లో కుసుమ దుస్తులు మార్చుకుని చేతుల్లో కాఫీ కప్పులతో వచ్చింది. తానొక కుర్చీలో కూర్చుని ఆ యిద్దరికీ కాఫీలు అందించి అన్నగారివంక తిరిగి

"వీరు యివాళ చాలా చిత్రమైన విషయం చెప్పారన్నయ్యా. అది మీ ఎకానమిస్టు లెవరూ యింతవరకూ కనిపెట్టలేదని బల్లగుద్ది మరీ చెప్పగలను.." అన్నది.

ఆయన తలఎత్తి చూసి నవ్వుతూ "ఏమిటో అది..." అన్నాడు. కుసుమ జోగినాధంవంక తిరిగి "చెప్పనా ?" అని అడిగింది. జోగినాధం బిడియపడుతూ "ఎందుకులెండి ? నా దంతా ఏదో పిచ్చివాగుడు." అన్నాడు.

ఆమె "అలా కాదు... చెప్పితీరాలి... అన్నయ్యా! వీరంటారు కదా, నీళ్ళే సర్వ నాగరికతకూ, సౌభాగ్యానికీ కారణంట... నీళ్ళు దొరకనిచోట్లా లేక తక్కువగా ఉన్న చోట్లా నాగరికత అభివృద్ధి చెందదనీ, ప్రజలు సంపన్నంగా ఉండరనీ కూడా వారి సిద్ధాంతం... ఇప్పుడు చెప్పు.. మీ ఎకనమిక్స్‌లో ఈ విషయం యింతకుముందు ఎవరైనా చెప్పారా ?" అన్నది.

ఆయన నవ్వాడు. కాఫీ కప్పు ఎదురుగా టీపాయ్ మీద ఉంచి "అది మంచిపాయింటే... మీరు చెప్పింది సబబుగానే ఉంది. కాదనను..." అన్నాడు.

కుసుమ జోగినాధంవైపు "చూశారా ! మీరు గెలిచారు" అన్నట్టు చూసింది.

కామేశం మళ్ళీ తల పంకించి "కాని యిందులో ఒక తమాషా ఉంది... మీరు చెప్పినట్టు నదు లెక్కువగా ఉన్న చోట్లా, వర్షాలు ఎక్కువగా కురిసేచోట్లా తప్పకుండా అభ్యుదయం ఉంటుంది. కాని అవి విపరీతంగావున్నా బాధే...

ఉదాహరణకు చూడండి... ఇప్పుడు నదులకు వరదలు వొస్తు న్నాయి. పంటలన్నీ గంగపాలై పోతాయి. లెక్కలేనంత మంది ప్రజలు నిర్వాసితులై పోతారు... అకాలంలో వర్షాలు కురిశాయనుకోండి... అప్పుడూ పంటలు ధ్వంసమే... కాబట్టి ఎటూ గట్టిగా రూలింగ్ యిచ్చేందుకు వీలులేదు..." అంటూ ఆగి, "అన్నట్టు మీ వూరేది?" అని అడిగాడు.

జోగినాథం చెప్పాడు. కుసుమ అందుకుని "వాళ్ళ వూరును గురించి యిప్పుడు నాకు చెప్పారన్నయ్యా! అటు వంటి వూళ్ళుకూడా ఉంటాయా అని ఆశ్చర్యపోయాను. నీళ్ళుకూడా కొనుక్కుంటేగాని దొరకవుట అక్కడ... తాగేం దుకూ, వొంటికి పోసుకునేందుకూ అన్నిటికీ నీటి కరువట" అన్నది.

ఆయన "అందులో విచిత్రమేముంది? అలా ఎన్నో వూళ్ళున్నాయి మన దేశంలో... అన్నట్టు ఈ సందర్భంలో మా స్నేహితు డొకాయన చెప్పిన విషయం ఒకటి గుర్తు వస్తున్నది. ఆయనను అటువంటి వూళ్లో ఎవరో భోజనానికి పిలిచారట... అదే మొదటిసారి ఆయన ఆ వూరికి వెళ్ళడం.. భోజనం చేస్తుండగా "మంచినీళ్ళేరేమిట"ని ప్రక్కవారిని అడిగాడట... వాళ్ళు ఆయన విస్తరిముందున్న ఒక చిన్న గాజుగ్లాసును చూపించి "అవిగో అవే మంచినీళ్ళు" అన్నా రట... ఆయన గ్లాసులో తెల్లగా తేనె కలిపినట్టున్న ఆ ద్రవం చూసి అంతవరకూ ఏదో డ్రింకు అనుకున్నాట్ట... తీరా చూస్తే అవే మంచినీళ్ళు..." అన్నాడు.

కుసుమా, జోగినాథం ఒక్క సారిగ నవ్వారు. తర్వాత జోగినాథం లేచి "ఇక వెళ్ళివస్తానండీ..." అన్నాడు. అన్నా చెల్లెళ్ళిద్దరూ అతన్ని గుమ్మందాకా సాగనంపి వుండి పోయారు.

అతడు నెమ్మదిగా నడిచి రూము చేరుకుని తాళం తీశాడు. లోపలికి వెళ్ళి చీకటిపడుతున్నందున లైటువేసి స్నానానికి సిద్ధమైనాడు. చిన్న కొల్లాయి గుడ్డ ఒకటి కట్టుకుని భుజంమీద మరో టవల్ వేసుకుని బావిదగ్గరికి చేరుకున్నాడు. మొదట ఒక పెద్ద బాల్చి నిండా నీళ్ళు తోడుకుని నూతి పళ్లెంమీద కూర్చున్నాడు. హాయిగా, ప్రశాంతంగా ఒకదాని తర్వాత ఒకటిగా మూడు పెద్ద బొక్కెనల నీళ్ళు పోసుకున్నాడు.

ఇంట్లో మరో భాగంలో అద్దెకున్న ఒక గుమాస్తా భార్య నీళ్ళకోసం చేతిలో బిందెతో తమ వాటా గుమ్మంలో నిరీక్షిస్తూ నిలబడివుంది. అతడామెను చూడనేలేదు. ఆమె లోలోపల "అతడు తనను చూసి కూడా త్వరగా తెమలక బాధపెడుతున్నా"డని అనుకుంటున్నది.

జోగినాథం నెమ్మదిగా అరగంట తర్వాత నూతి పళ్లెం దిగి యివతలికి వచ్చాడు. ఇంటి యజమానురాలు అంతసేపటినుంచీ యీ తంతు అంతా చూస్తూనే వుంది. ఆమె నెమ్మదిగా అతన్ని మందలిస్తూ "అలా పనివేళా గంటల తరబడి నూతి పళ్లెంమీద కూర్చుండిపోతే ఎలాచెప్పు నాయనా! ఆవిడ యిందాకటినుంచి నీళ్ళకోసం తొందర

పడుతూ నీ కారణంగా అక్కడే నిలబడి వుంది ... చూడ లేదూ ?" అన్నది.

జోగినాథం నాలిక కరచుకుని ప్రక్కకు తిరిగిచూసి "పొరపాటయి పోయిందండీ..." అన్నాడు.

అతడు తర్వాత రూములో కొద్దిసేపు విశ్రాంతిగా కూర్చున్నాడు. ఆవేళ జరిగిందంతా మననం చేసుకున్నాడు. తన రూమ్ మేట్స్ యిద్దరితోనూ తాను అలా వ్యవహరించడంలోని ఉచితానుచితాలు బేరీజు వేసుకుని ఆలోచించాడు. చివరకు తానేమీ తప్పు చెయ్యలేదని నిర్ణయించుకున్నాడు. అయినా ఆ యిద్దరూ తనకు మంచి మిత్రులు. అటు ఆఫీసులోనూ వాళ్లు చేస్తున్న సహాయం అమూల్యమైనది. ఇద్దరూ చక్కగా చదువుకున్న వాళ్ళు. డబ్బున్న వాళ్ళు. వాళ్ళకు తనమీద అంత అభిమానం వుండటం తనకెంతో మంచిది. దాన్ని తాను పోగొట్టుకోకూడదు.

ఉమాపతి గోదావరి జిల్లావాడు. మంచి సంపన్న కుటుంబంలో పుట్టినవాడు. అతని తండ్రికి పిత్రార్జితమైన తోటలూ పొలాలూ, దొడ్లూ ఘనంగా వున్నాయి. అతడు బుద్ధిగా చదువుకున్నాడు. ఏ క్లాసులోనూ తప్పలేదు డిగ్రీ రాగానే, చిన్నదే అయినా దొరికిన ఉద్యోగంలో వెంటనే చేరాడు. అతడు యింటికి నయాపైసా కూడా పంపనక్కర లేదు. ఇక లక్ష్మీపతి ఉన్నాడంటే అతని తండ్రి మొదట్లో బాగా కష్టాలు పడ్డవాడు. అయితేనేం ఆయనకు డబ్బు విలువ తత్వమూ బాగా తెలుసు ... కొంత డబ్బు సంపాదించిన తర్వాత యిక మన తెలివి తేటలూ ప్రమేయమూ

లేకుండానే ఆ డబ్బు, అతిగా పెరిగిపోతుందనీ అందులో అతిశయోక్తి ఏమాత్రమూ లేదనీ ఆయన దృఢవిశ్వాసం... కావలసిందల్లా కొంచెం లౌక్యమనీ. డబ్బు మదుపు పెడితే అది కరిగేచోట్లూ, తరిగే చోట్లూ ఉన్నాయనీ, పెరిగే చోట్లు గమనించి మదుపుపెట్టే మాత్రపు తెలివితేటలు చాలుననీ, ఇక ఆవైపు కూడా అప్పుడప్పుడు తప్ప చూడనక్కరలేదనీ ఆయన అంటూ వుంటాడు. ఆయన అలాగే చేసి ఆస్తులు అలాగే పెంచాడు కూడా. లక్ష్మీపతి ఆయనకు ఒక్కడే కొడుకు. ఇంట్లో అతని మాటకు ఎదురన్నది లేదు.

జోగినాథం మనస్సులో కుసుమ మెదిలింది. ఆ అమ్మాయి ఎంతో అందంగా వుంటుంది. దబ్బపండు వంటి శరీరచ్ఛాయ ఆమెది. నాజూకైన సన్నని బంగారపు పుల్లలవంటి వ్రేళ్ళు టైపు మెషీనుమీద చకచక కదులుతూ వుంటే చూసేందుకు ఎంతో అద్భుతంగా ఉంటుంది. ఆమె కన్నులు చెంపకు చేరెడేసి ఉండి తళతళ లాడుతున్న నీళ్ళను గుర్తుకు తెస్తాయి. ఆమె అన్న కామేశం అంత చిన్న వయస్సులో కాలేజీ లెక్చరరు అయినాడంటే ఎంతో తెలివిగలవాడయి వుండాలి. ఆయన కూడా స్ఫురద్రూపి.

జోగినాథానికి తన చెల్లెలు గుర్తుకు వచ్చింది. ఆ అమ్మాయికూడా ఒక వన్నె తక్కువగా కుసుమ రంగే, అయినా నీళ్ళ కరువు మూలంగనూ, తగిన పోషణలేకనూ ఆపిల్ల జబ్బుపడి లేచిన దానిలా ఉంటుందెప్పుడూ ... కాని ఆ అమ్మాయి తెలివితేటలూ, ఓర్పూ, పనిపాటలలో నేర్పూ

చెప్పుకోదగ్గవి. దానికి పెళ్ళిచేసి ఒక యింటిదాన్ని చేస్తే తమ బాధ్యత సగం తగ్గుతుంది. దానికి ఎక్కడ వ్రాసిపెట్టి వుందో మరి... అది కాస్తా అయితే తన తల్లిని, చిన్న చెల్లెలినీ తీసుకుని యిక్కడికి మకాం మార్చేయవచ్చు. అప్పటికి తమ శని తప్పినట్టవుతుంది. అయినా ఆడపిల్ల పెళ్ళి మాటలతో, ఆలోచనలతో అవుతుందా? దానికెంత కష్టపడాలి? కట్నం పేచీ లేకుండా ఎక్కడైన సంబంధం కుదిరితే బాగుండిపోను ... అయినా తన పిచ్చిగాని, కట్నం లేకుండా ఎవడు పెళ్ళికి ఒప్పుకుంటున్నా డీ రోజుల్లో!

అతడు లేచాడు. రూముకు తాళం వేసి వీధిలోకి వచ్చి నడవటం ప్రారంభించాడు. అక్కడొకటీ అక్కడొకటీ వీధి దీపాలు వెలుగుతున్నాయి. దూరంగా ఎక్కడో రైలు 'కుప్పు కుప్పు' మని పొగ వొదులుతూ పరుగెత్తి పోతున్నది.

జోగినాథం కామేశాన్ని గురించే ఆలోచిస్తున్నాడు. అతన్నీ, తన చెల్లెలినీ మనసులో పక్కపక్కనే నిలబెట్టుకుని మాటిమాటికీ ఆలోచనలో మునిగిపోతున్నాడు. చివరకు హోటలు ముందుకు వచ్చేసరికి తలపూపి ఏదో నిశ్చయానికి వచ్చాడు.

అతడు హోటల్లో ఒక బల్లముందు కూర్చుని అరిటాకు కడుగుతూ ఉండగా పక్కనే వున్న యిద్దరు సర్వర్లు "మంచినీళ్ళ పంతులుగా రొచ్చారు ..." అనుకుని నవ్వుకున్నారు. తర్వాత వాళ్లలో ఒకడు ఏకంగా ఒక జార్ నిండా

నీళ్లు తెచ్చి జోగినాథం ప్రక్కనే బల్లమీాదవుంచి వడ్డన ప్రారంభించాడు. అతడు భోజనం చేసినంతసేపూ వారిద్దరూ ప్రతి పూటా చేసినట్టే ఆపూటకూడా అత డెన్ని గ్లాసుల నీళ్ళు తాగాడో లెక్క పెట్టారు. చివరకు లెక్క ఎక్కడో తప్పింది. ఒకడు పదిహేను గ్లాసులనీ, మరొకడు పధ్నాలుగు గ్లాసులు మాత్రమేననీ కొంచెంసేపు తమలో తాము తర్కించుకుని తర్వాత సర్దుకున్నారు.

జోగినాథం భోజనం ముగించి చెయ్యి కడుక్కుని రూము చేరుకున్నాడు. లైటువేసి పక్కమీాద వాలి కాగితమూ కలమూ తీసుకుని యింటికి ఉత్తరం వ్రాశాడు. మామూలు యోగక్షేమాలతోబాటు అతడు కుసుమ అన్నగారి విషయంకూడా అందులో ప్రస్తావించి "కులగోత్రాల వంటి చిక్కులు రాకుండావుంటే, ఆయన ఒప్పుకుంటే నిజంగా మన చెల్లాయి అంత అదృష్టవంతురాలు ఎక్కడా ఉండదనే నా విశ్వాసం... నేను రేపే అన్ని వివరాలూ తెలుసుకుని మళ్ళీ నీకు వ్రాస్తాను..." అని వ్రాశాడు.

తర్వాత కాగితం, కలం ప్రక్కనే ఉంచి ఆవులించి చిటికెవేసి వెల్లకిలా పడుకుని పై కప్పువంక చూాస్తూ ఉండిపోయాడు. అంతలోనే అతని కళ్ళు మూాతలుపడ్డాయి.

పది గంటలు దాటిన తర్వాత సినిమా నుంచి వచ్చిన యిద్దరు మిత్రులూ గాఢంగా నిద్రపోతున్న జోగినాథం వంక చూసి నవ్వుకున్నారు. ఉమాపతి మెల్లిగా "తలుపు బార్లగా తీసిపెట్టి ఎలా దిట్టంగా నిద్రపోతున్నాడో చూడు" అన్నాడు లక్ష్మీపతితో.

లక్ష్మీపతి కిటికీ పక్కగా పడివున్న కార్డును చేతిలోకి తీసుకుని చూసి "ఇది నీదేనయ్యా ... ఇవాళే వచ్చినట్టున్నది" అన్నాడు. ఉమాపతి దాన్ని అందుకుని చదివి అవతల పడేస్తూ "నాన్నగారు వ్రాశారు ... మళ్ళీ వరద లొస్తున్నాయట. ఈఏడు కూడా పంటల శాలుబడి తక్కువగా ఉంటుందేమోనని వ్రాశారు. అది ప్రతి రెండు మూడేళ్ళకూ మామూలే. వరద రావడం నిండు పంటను తుడిచిపెట్టిపోవడం... మా పొలాలు కొన్నిటికి ఫరవాలేదు కాని కొన్ని మాత్రం బాగా దెబ్బతింటాయి." అంటూ నిద్రపోతున్న జోగినాథం వంక చూసి మళ్ళీ "ఈ గురువుగారికేమో నీళ్ళ కరువు. తాగేందుకు నీళ్లచుక్క కూడా లేక వీళ్లు అవస్థ పడుతూ వుంటారు. మాకేమో వరదలు ... ఎంత తమాషాగా ఉందో చూడు" అన్నాడు.

లక్ష్మీపతి ఏమీ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా దుస్తులు మార్చుకుని జోగినాథంవైపు చూస్తూ ఉమాపతితో "ఉత్తరం రాస్తున్నాడయ్యా యింటికి..." అని మళ్ళీ ఏదో రహస్యం చెబుతున్నట్టు నెమ్మదిగా "పోయిన నెలలో అనుకుంటాను... అంటే యిక్కడికి వచ్చిన పది పదిహేను రోజులకు అతను యింటికి వ్రాసిన ఉత్తరం ఒకటి చదివాను. తప్పేఅనుకో. అయినా ఎంత తమాషాగా వుందో తెలుసా! అబ్బ! దారుణం! ఒక మతి చలించినవాడు రాసినట్టున్నది ఆ వుత్తరం... ఇక్కడ ఒంటినిండా పుష్కలంగా కావలసినన్ని నీళ్లు పోసుకుంటున్నాననీ, కరువుతీరా నీళ్లు తాగుతున్నా

వనీ, తన వొంటిరంగు మారి ఆరోగ్యం కూడా పూర్వం కంటె ఎంతో బాగున్నదనీ వ్రాశాడు. పైగా నీళ్ళు తాగే టప్పుడు తల్లినీ, చెల్లెళ్ళనూ తలుచుకుని తలుచుకుని మరీ తాగుతాట్ట ... అదీగాక అంతకుముం దెప్పుడో వాళ్ళ వూళ్ళో చిన్న చెల్లెలు నీళ్ళబిందె దొర్లించి కష్టపడి తెచ్చు కున్న నీళ్ళన్నింటినీ నేలపాలు చేసిందని తల్లి ఆ చిన్నపిల్లను చావ బాదిన వృత్తాంతం అతను నాకు చెప్పాడు. ఉమాపతీ! అది నువ్వు విన్నట్టయితే నిలువునా వొణికిపోయి వుండే వాడివి.. " అన్నాడు.

జోగినాథం నిద్రలో మరోవైపుకుతిరిగి పడుకున్నాడు. ఉమాపతి మెల్లిగా ఆ వుత్తరం అందుకుని మడత విప్పాడు. ఇద్దరూ మోకాళ్ళమీద కూర్చుని ఆ వుత్తరాన్ని చివరి వరకూ చదివి మొహాలు చూసుకున్నారు. తర్వాత దాన్ని యథాపూర్వంగా మడిచి యథాస్థానంలో ఉంచి ఇవతలికి వచ్చారు.

ఉమాపతి నెమ్మదిగా గొంతు తగ్గించి "అంటే మనం వెళ్ళిన తర్వాత కుసుమ వంట వాళ్ళ యింటికి వెళ్లా డన్నమాట." అన్నాడొక విధంగా చూస్తూ.

లక్ష్మీపతి "అంతే అయివుండాలి మరి..." అని బదులుపలికాడు.

* * *

మరునాడు ఆఫీసులో జోగినాథం సాయంకాలం నాలుగు గంటలుదాటేవరకూ కుసుమను పలుకరిద్దామని ఎంత

గానో ప్రయత్నంచేశాడు. కాని, వీలుపడలేదు. నలుగురూ అక్కడే ఉండటమూ, పైగా కుసుమ చాలా హడావిడిగా పనిలో మునిగిఉండటమూ అందుకు ముఖ్యకారణాలు.

నాలుగున్నరకే అతడు తన పని పూర్తిచేసుకుని తీరికగా కూర్చున్నాడు. ఉమాపతికి ఆరోజున అసలు పనిలేనట్టే లెక్క. అతని సీటుతీరే అంత. పని బహుకొద్దిగా మాత్రమే ఉంటుంది. లక్ష్మీపతి మాత్రం ఏవేవో ఫైళ్ళు తిరగవేస్తూ రిఫరెన్సులకోసం తంటాలు పడుతున్నాడు.

జోగినాథం నీళ్ళకూజావంక చూశాడు. మళ్ళీ అటూ యిటూ చూశాడు. నెమ్మదిగా లేచి కూజా దగ్గరికి వెళ్ళి నీళ్ళు గ్లాసులోకి వంచుకున్నాడు. చేతిలో గ్లాసు పైకెత్తి పట్టుకుని ఒక్క క్షణంచూసి తర్వాత గడగడ త్రాగాడు.

అది గమనించి శర్మ అనే మరో గుమాస్తా ఏమీ పనిలేక తీరికగా కూర్చుని ఉండి, నవ్వి, "మన కూజాలో నీళ్ళనీ ఒక్క జోగినాథంగారే కాజేస్తున్నారండీ... అదేమి చిత్రమో ! ప్రతి అరగంటకూ ఆయనకు దాహమవుతూనే ఉంటుంది" అన్నాడు.

వైనతేయరావు అనే మరో గుమాస్తా ఫైలులో నుంచి తల పైకెత్తి చూసి "బహుశా అదేదో జబ్బయి వుంటుంది" అని మళ్ళీ తలదించుకున్నాడు.

జోగినాథం నవ్వేందుకు ప్రయత్నించాడు. ఉమాపతీ, లక్ష్మీపతీ, ఒకరివంక ఒకరు చూసుకున్నారు.

ఇంతలో టైప్ మెషీను చప్పుడు ఒక్క నిముషం ఆగినట్టుకాగా జోగినాథం తలఎత్తి చూశాడు. కుసుమ బల్ల మీద చెయ్యి ఉంచుకుని తీరికగా, విశ్రాంతిగా కూర్చుని ఉంది. జోగినాథం నెమ్మదిగా ఆమె దగ్గరికి వెళ్ళి గొంతు తగ్గించి "ఏమండీ... మీతో కొంచెం మాట్లాడాలి..." అన్నాడు.

ఆమె నవ్వి "మాట్లాడండి ..." అన్నది.

అతడామె ముందు కుర్చీలో కూర్చుని ఏదో చెబుదామని నోరు తెరిచేసరికి తన కొంప ఏదో మునిగినట్టు ఆఫీసరు గదిలో బెల్ 'గర్' మని మ్రోగింది. ఆమె హడావిడిగా లేచి "తర్వాత మాట్లాడుకుందాం... ఆఫీసరు పిలుస్తున్నారు. అన్నట్టు యివాళ మేము సినిమాకు వెడదామనుకున్నాం... మీరూ రండి, మా అన్నయ్య సంతోషిస్తాడు. పైగా మీరు మాట్లాడనూవచ్చు..." అంటూ హడావిడిగా ఆఫీసరు గదిలోకి వెళ్ళింది.

జోగినాథం కొద్ది క్షణాలు అలాగే కూర్చుండిపోయాడు. ఇవాళ ఏది ఏమయినాసరే వారితో యీ విషయం ప్రస్తావించి వివరాలు తెల్సుకుని ఉత్తరం వ్రాయాలి. నిజంగా యీ సంబంధం కుదిరితే అమ్మ ఎంతగా సంబరపడిపోతుందో!

కుసుమ మరో అయిదు నిముషాలకుగాని యివతలికి రాలేదు. వస్తూనే ఒక కాగితం చూపించి జోగినాథంతో

"ఇదుగో యీ ఒక్కటీ అందజేస్తే వెంటనే మనం వెళ్ళిపోవచ్చు..." అంటూ చకచక పనిచెయ్యసాగింది.

జోగినాథం 'అలాగే' అని తలవూపి లేచి నెమ్మదిగా నడిచివచ్చి యివతలి వరండాలో నిలబడి జేబులో చేతులు పెట్టి వెదికాడు. రెండు రూపాయనోట్లు కనిపించాయి. అతడు తేలికగా నిట్టూర్చి మళ్ళీ తన సీటులోకివచ్చి కూర్చున్నాడు. ఉమాపతి లక్ష్మీపతితో ఏదో రహస్యం మాట్లాడుతున్నాడు.

ఉన్నట్టుండి ఉమాపతి శర్మ అనే గుమాస్తాతో "మీ రిందాక జోగినాథం నీళ్ళు తాగడం గురించి మాట్లాడారు చూశారా! మీ రా విషయంలో మరికొంత తెలుసుకోవడం అవసరం... వాళ్ళ ప్రాంతంలో వూళ్ళన్నీ ఎప్పుడూ కరువుతో కొట్టుకుపోతూ ఉంటాయి. ఎక్కడా నీళ్ళ చుక్క కూడా దొరకదు. కడుపునిండా తాగేందుకు, వొంటినిండా పోసుకునేందుకూ నీళ్ళుండవు. తాగేందుకు బిందెడు నీళ్ళు మూడణాలు పెట్టి మారీ కొనుక్కోవాలి. అటువంటి వూరి నుంచి వొచ్చినవాడికి ఇక్కడ పుష్కలంగా నీళ్ళు దొరికేసరికి కోతికి కొబ్బరికాయ దొరికినట్టేకదా" అన్నాడు.

జోగినాథం "అవును. భగవంతుడి దయ అలా ఉంది. మాకు నీళ్ళు లేవు... మీరేమో వరదల్లో మునిగిపోతున్నారు" అన్నాడు.

ఉమాపతి "భగవంతుడి దయ అనకు... అధర్మం పెరిగితే అంతే... నీటిచుక్క దొరకదు..." అన్నాడు.

జోగినాథం ఉడుకుమోతుతనంతో "వరదలు రావడానికి కారణం అధర్మం కాక మరేమిటో..." అన్నాడు.

లక్ష్మీపతి అందుకుని "అలా కాదు. ఇది మరీ దారుణం... నువ్వే చెప్పావు ఒకసారి గుర్తుందా! మీ చిన్న చెల్లాయి నీళ్ళబిందె దొర్లించడం సంగతి" అన్నాడు.

శర్మ, వైనతేయరావూ ఒక్కసారిగా "ఎవరా చెల్లాయి? ఏమా కథ? అది చెప్పండి ముందు" అన్నారు.

లక్ష్మీపతి జోగినాథం వంక తిరిగి "చెప్పనా?" అని అడిగి, తర్వాత అతని సమాధానం కోసం ఎదురు చూడకుండానే ప్రారంభించాడు. "అతనే చెప్పాడు వొచ్చిన కొత్తల్లో... ఒకసారి వాళ్ళ యింట్లో జరిగిన విషయమే... రాత్రి అంతా కష్టపడి బావికీ యింటికీ తిరిగి ఒక బిందెడు మంచినీళ్ళు సంపాయించుకున్నారట. మర్నాడు ఉదయం వాళ్ళ చెల్లెలు—చిన్నపిల్ల—గ్లాసు ముంచుకోబోగా ప్రమాదవశాత్తూ బిందె దొర్లిపోయింది. నీళ్ళన్నీ నేలపాలై పోయాయి. ఆ పిల్ల భయంతో బిగుసుకుపోయి నిలబడిపోయింది. తల్లి వచ్చి రెక్క పుచ్చుకుని గొడ్డును బాదినట్లు చావగొట్టిందట... ఇలా అని అతనే చెప్పాడు నాకు. కావలిస్తే అడగండి..."

జోగినాథం వంచిన తల ఎత్తలేదు. ఉమాపతి "ఇక ఇతను స్నానం ప్రారంభించాడా ... అది గంటల తరబడి సాగుతుంది!... ఒక్కొక్క బొక్కెనే తోడుకుని 'యిది చెల్లాయికి...' 'యిది అమ్మకు,' 'యిది చిన్న చెల్లాయికి' అని గొణుక్కుంటూ వొంటిమీద పోసుకుంటాడండీ ...

తాగేటప్పుడూ అంతే ...... గ్లాసు పైకెత్తి పట్టుకుని చూస్తాడు మీరు గమనించారో లేదో. ఆ చూడటం వలక లున్నాయేమోనని మాత్రం కాదు ... కళ్ళు మూసుకుని ఏమిటో గొణుక్కుని మరీ తాగుతాడు. రోజూ తెల్లవారు తుండగానే కృష్ణకు బయలుదేరి పోతాడు. సాయంకాలం పూట యింట్లో బావి ఉండనే ఉంది. ఇక హోటల్లో సర్వర్లం దరూ యితని కేం బిరుదు యిచ్చారో తెలుసా! 'మంచినీళ్ల పంతులుగారు.' మొన్న నేను విన్నాను." అన్నాడు.

శర్మ "ఇది వింత కేసే" అన్నాడు.

వైనతేయరావు వంకరగా నవ్వి గంభీరంగా "ఇదొక మానసిక వ్యాధి అయిఉంటుంది" అన్నాడు.

జోగినాథానికి కోపం ముంచుకు వచ్చింది. వీళ్ళం దరూ తనను గేలిచేసి ఏడిపించేందుకు ప్రయత్నిస్తున్నారనే విషయం స్పష్టంగా తెలిసిపోయింది. ఆ క్రౌర్యం అతడు భరించలేకపోయాడు. అందరికీ నిప్పులు చెరిగే కళ్ళతో చూశాడు. కుసుమ అన్నీ వింటున్నది కాబోలు సానుభూతితో చూస్తున్నది.

వైనతేయరావు ఊరుకోకుండా "ఏది ఏమయినా అలా చాదస్తంగా"... అని ఏదో అనబోతూఉండగా, జోగి నాథం పెద్దగా "ఇక తమరేమీ మాట్లాడకండి సార్. ఇప్ప టికే చాలా అసహ్యంగా మాట్లాడారు ... మిమ్మల్నీ అర్థంచేసుకోగలను లెండి... అంత చాదస్తుడని పసివాణ్ణేమీ కాదు ..." అన్నాడు.

శర్మ అనే గుమాస్తా కలగజేసుకుని "అదేమిటండీ... మిమ్మల్ని యిప్పుడేమన్నామని మీకు అంత కోపం ! ఏదో నీళ్లు ఎక్కువగా తాగుతారనీ ... "అంటూ ఉండగా ఇక జోగినాథం వూరుకోలేకపోయాడు. విసురుగా సీటులో నుంచి లేచి "ఆపండిక... మీరింకా అలాగే మాట్లాడుకుంటూ పోతే ఏం చేస్తానో నాకే తెలీదు." అంటూ ఉద్రేకంతో ఊగిపోతూ, "అవునండీ... నేను నీటిచుక్క దొరకని వూళ్లో పుట్టి పెరిగాను. ఇక్కడ నీళ్లు చూసేసరికి కోతికి కొబ్బరికాయ దొరికినట్టే అయింది. విపరీతంగా తాగుతున్నాను. అంతే కాదు... కావలిస్తే మూర్ఛవాడిలా పొట్ట పగిలేట్టు నీళ్లు తాగుతాను. పిచ్చివాడిలా గంటల తరబడి స్నానంచేస్తాను. లేకపోతే ఏదన్నా మంచి ముహూర్తం చూసి కృష్ణలో పడి చస్తాను అయితే మాత్రం ! మీకెందుకు ?" అన్నాడు.

తర్వాత కణతలు పట్టుకుని సీటులో కూర్చుండిపోయాడు. అంతటా నిశ్శబ్దమైపోయింది. ఎవరూ పెదవి కదపలేదు. కుసుమ టైపు చేయడంలో మునిగిపోయింది. జోగినాథం యింత జరిగిన తర్వాత ఎప్పుడో అక్కడినుంచి పారిపోయి ఉండేవాడు. కాని యివాళ కుసుమతో, ఆమె అన్నగారితో మాట్లాడాలి. అది తప్పదు.

ఒక పావుగంట తర్వాత చాలామంది యిళ్ళకు వెళ్ళిపోయారు. కుసుమ టైపు మెషిను మీద కవరు వేసి సిద్ధమై జోగినాథం వంక చూసింది.

అతడు లేచి నిలబడి రుమాలుతో మొహం తుడుచుకుని ఆమె వెంట బయలుదేరాడు. ఇద్దరూ మెట్లు

దిగులుగా వుండగా ఆమె జోగినాథంతో "మీరెందుకలా యిరిటేట్ అవుతారు?" అన్నది.

జోగినాథం వెంటనే సమాధానం చెప్పలేదు. కాని, ఒక్క క్షణం ఆగి "అలా మనిషిని నిస్సహాయంగా చేసి వెర్రివాణ్ణి చేస్తుంటే ఎలా సహించడం చెప్పండి? ఏమయినా కారణం ఉందా అంటే ఏమీలేదు. నా చేతికి ఆరు వేళ్ళున్నాయి కదా! అది పట్టుకుని నన్ను నలుగురిలో ఎగతాళి చేస్తుంటే ఎలా ఉంటుంది చెప్పండి? అవును నిజమే... మా వూళ్లూ, మా ప్రాంతమూ వట్టి దౌర్భాగ్యపువే. నీళ్ళ కరువు ఉంటే దౌర్భాగ్యం కాక మరేంటి? అయినా మధ్య నేనెందుకు వెర్రివాణ్ణవుతాను. 'ఇదొక మానసిక వ్యాధిట.' ఆ వైనతేయరావు పిలక నా చేతిలో ఉంది. ఏమనుకుంటున్నాడో ఏమో? బోడిపేరు వాడూనూ... ఈసారి యిలా ఏమన్నా వాగితే ఆఫీసరుతో చెప్పేస్తాను' అన్నాడు.

కుసుమకు నవ్వు వచ్చింది కాని ఆమె నవ్వలేదు. అతను ఆఫీసరుకు చెబుతాననప్పుడు, తోటి పిల్లవాడిమీద కోపగించి మేష్టారితో రిపోర్టుచేస్తానని బెదిరించే బడిపిల్లవాడు గుర్తుకువచ్చాడామెకు.

ఇద్దరూ కుసుమ ఇంటిముందు ఆగేసరికి లోపలినుంచి గోలగా నవ్వులు వినిపిస్తున్నాయి. కుసుమ తలుపు తట్టి అతనివైపు చూసి "ఎవరో బంధువులు దిగినట్టున్నారు" అన్నది.

తలుపు తెరిచిన చిన్నపిల్ల మామూలుగనే "అక్కయ్యొచ్చిందో" అని రాగంతీస్తూ లోపలికి వెళ్ళింది.

హాల్లో చాపమీద కూర్చుని క్యారమ్సు ఆడుతున్న వ్యక్తులను చూడగానే కుసుమ ఆనందంతో పరుగెత్తుకు వెళ్ళి "అరె! నువ్వెప్పుడొచ్చావ్ వసంతా?" అని అడిగింది. జోగినాథం గుమ్మం దగ్గరగా నిలబడి ఉండిపోయాడు. ఆ వసంత అనబడే అమ్మాయి "ఇప్పుడే... ఒక అరగంట అయిందేమో.. లోపల అమ్మ ఉంది..." అన్నది.

జోగినాథం ఆశ్చర్యపోతూ చూశాడు. అంత అందమైన స్త్రీ నతడు ఇంతవరకూ చూడలేదు. ఆమె ఎడమ చేతి కొక వాచీ, కుడిచేతికి మూడో నాలుగో బంగారు గాజులూ ఉన్నాయి. ఆ బంగారురంగు ఆమె వంటిమీద జాత్తిగా కనిపించకుండా ఉంది. నల్లని చిలిపి ముంగురులు కొన్ని నుదుటిమీద పడుతూవుంటే వాటిని ఎడమచేతి వ్రేళ్ళతో పైకి తోసుకుంటున్న దామె. నవ్వుతున్నప్పుడల్లా బుగ్గలు ఎంతో అందంగా సొట్టలు పడుతున్నాయి. ఆమె వయస్సు పదహారేళ్ళకు మించి ఉండదు.

కుసుమ జోగినాథంతో "సారీ! యిలా రండి మీరు... కూర్చుని ఉండండి, యిప్పుడే వస్తాను..." అన్నది.

కామేశం ఆ మాటలు విని తల తిప్పి చూసి "అరె! మీరూ వచ్చారా? గుడ్. ఇలా కూర్చోండి..." అంటూ మళ్ళీ తన ఆటలో లీనమైపోయాడు.

కుసుమ కొద్ది నిముషాల్లో యివతలికి వచ్చింది. జోగినాథం అక్కడే వారి ఆట చూస్తూ కూర్చుని ఉన్నాడు.

కుసుమ ముందుకు వచ్చి "అన్నయ్యా! యివాళ మరి సినిమా ప్రోగ్రాం ఎలా రా?" అని అడిగింది.

కామేశం "దానికేం!" అన్నాడు. అంతలో లోపలి నుంచి ఒక ముప్ఫయి అయిదేళ్ళ స్త్రీ వచ్చి "అవును ... దానికేం! మీరు సినిమా మానుకోవడ మెందుకూ? అందరూ సరదాగా వెళ్ళిరండి... నేను యింటిదగ్గర వంటా వగైరాలు చూసుకుంటాను" అన్నది.

కుసుమ "ఇంకా టైముందిగా ... రెండాట లాడి పోదాం... నేనూ అన్నయ్యా ఒక పార్టీ" అన్నది.

వసంత కాయిన్స్ తీస్తూ "అలా వీల్లేదు. నేనూ మీ అన్నయ్యా ఒక పార్టీ" అన్నది.

కుసుమ "నెరజాణవే నువ్వు... అప్పుడే అన్నయ్యను కలిపేసుకుంటున్నావ్. ఆగవమ్మా కొంచెం గుర్రాన్ని కట్టెయ్. కోర్సు పూర్తికానీ..." అన్నది.

జోగినాథం చిత్రమైన అవస్థలో పడ్డాడు. అంతలో మళ్ళీ కుసుమ అతిన్ని ఉద్దేశించి "సరే రండి... సార్... మీరూ నేనూ ఒక పార్టీట... కూర్చోండి" అన్నది.

అతడు సిగ్గుపడుతూ "నాకు బొత్తిగా రాదండీ... ఎలా?"... అన్నాడు.

కామేశం "ఫరవాలేదు... ఇక్కడ అందరూ యింట ర్నేషనల్ ప్లేయర్సే... ఎవరికీ బాగా రాదు... ఏదో సరదాగా ఆడుకుంటాం కానీ మరొకటి కాదుగదా! రండి రండి..." అన్నాడు.

జోగినాథం బిడియపడుతూ కూర్చున్నాడు టాస్ వేయగా కుసుమకు అనుకూలంగా పడింది. ఆమె జోగినాథానికి స్ట్రయికర్ అందించి "ఊఁ! కానివ్వండి" అన్నది.

జోగినాథం ఎడమచేతితో స్ట్రయికర్‌ను బలంగా కొట్టాడు. వసంత ఆశ్చర్యంతో కళ్లు పెద్దవిచేసి "మైగాడ్! ఈయన ఎడమచేతి వాటం ... పైగా ఆరు వేళ్లున్నాయి" అన్నది.

కుసుమ "అన్నట్టు మరిచేపోయాను. వసంతా! వీరు మిస్టర్ నాథ్ అని, మా ఆఫీసులో పనిచేస్తున్నారు" అని పరిచయం చేసింది. వసంత చేతులు జోడించింది.

ఆమె మళ్ళీ జోగినాథంతో "ఈమె మా మేనత్త కూతురు. పేరు వసంత... సెకండియర్ బి. ఎస్‌సి. వుడ్ బి మిసెస్ కామేశం ... అంటే మాకు కాబోయే వదినగారన్నమాట. వాళ్ళకు తొందరగానే ఉంది గాని మా మామయ్య అండ్ కో పెద్దవాళ్ళందరూ 'అఁయ్! తొందర పనికిరాదు. ముందర పిల్ల చదువు పూర్తి కావాల్సిందే. అందాకా అలా ఉండండి, వేరువేరుగా కలలు కంటూ' అని మందలించారు. అదన్నమాట అసలు విషయం" అన్నది.

వసంత బుగ్గలలో గులాబులు విచ్చుకున్నాయి. కొంచెం ఎర్రబడిన మొహంతో ఆమె కుసుమను మోచేత్తో పొడిచి మెల్లగా "ఛీ, వూరుకోవే!" అన్నది.

కామేశం నవ్వి జోగినాథంతో "మావాళ్లు మరీ రాలుగాయి పిల్లలండీ బాబూ!" అన్నాడు.

జోగినాథం దిగాలుపడి పోయాడు. ఒక్కసారిగా మని షిలో సత్తువ పన్నగిల్లి నీరసం ఆవరించింది. ఆట ఆడుతూనే వున్నాడు కాని మనసంతా చీకాకై పోయింది. సినిమా రీలులో లాగా తన వూరూ... చెల్లాయిలూ, తల్లీ, గడ్డి కూడా మొలవని చవిటినేలా, రాళ్ళు పగిలే ఎండలూ, వెచ్చనిగాలీ, నీళ్ళు లేని బావులూ, నీళ్ళకోసం పాట్లూ, ఎక్కడ చూసినా నీరసంగా నిస్తేజంగా వుండే జనమూ ... మనసులో తిరిగిపోయారు.

ఒక ఆట పూర్తి అయింది. కుసుమ "కాబోయే దంప తులు గెలిచారు... సరే యిక యిదికట్టి పెడదాం... ... టైమవుతున్నది. అన్నయ్యా! నువ్వు తయారేనా?" అన్నది.

కామేశం లేచి "జస్ట్ వన్ మినిట్" అంటూ లోప లికి వెళ్ళాడు. జోగినాథం కూడా లేచి చొక్కా గుండీలు సర్దుకుంటూ "నేను వెళ్ళివస్తానండీ" అన్నాడు.

కుసుమ ఆశ్చర్యపోయి "అదేమిటండీ... మీరు కూడా వస్తానన్నారుగా... పైగా మా అన్నయ్యతో ఏదో మాట్లాడాలన్నారు కదా!" అన్నది.

జోగినాథం ఏం చెప్పాలో తెలియక "ఏమీ లేదు లెండి" అని వూరుకున్నాడు. కుసుమ "మరి?" అని రెట్టించి అడిగింది.

జోగినాథం యిక అక్కడ నిలబడలేక పోయాడు. "ఏమీ లేదులెండి... కాలేజీ విషయాలేవైనా చెబుతా రేమోనని కాస్సేపు తీరికగా మాట్లాడుదామనుకున్నాను.

వీలైతే నైట్ కాలేజీలో చేరుదామని వుందనుకోండి... అంతకంటె మరేమీ లేదు. మరోసారి మాట్లాడుతాను లెండి అదేమీ పెద్ద ముఖ్య విషయం కాదుగా! వెళ్ళి వస్తానింక" అంటూ వీధిలోకి వచ్చేశాడు. కుసుమ అలాగే ఆశ్చర్యంతో నిలబడిపోయింది.

అతడు నేరుగా రూముకు వచ్చేశాడు. తలుపులు తెరిచే వున్నాయి. ఉమాపతీ, లక్ష్మీపతీ, చెరొక పక్క పడుకుని కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. వాళ్ళిద్దరూ ఒకచోట చేరితే యిక కబుర్లకూ నవ్వులకూ లోటుండదు. ఏవేవో కాలేజీ కబుర్లు చెప్పుకొని విరగబడి నవ్వుకుంటూ వుంటారు.

జోగినాథం రావడం చూసి యిద్దరూ కబుర్లు ఆపేశారు. అతడు లోపలికి వెళ్ళీ వెళ్ళటంతోనే పక్కమీద వాలిపోయి కళ్ళు మూసుకున్నాడు. ఉమాపతి లక్ష్మీపతి వంక చూసి కన్నుగీటుతూ "సినిమాకు వెళ్ళలేదా గురువుగారూ!" అని అడిగాడు జోగినాథాన్ని. జోగినాథం "లేదం"టూ తల అడ్డంగా వూపాడు.

తర్వాత అతడు లేచాడు. క్రితం రాత్రి తాను యింటికి వ్రాసిన ఉత్తరం యివతలికి తీసి దాన్ని ముక్కలు ముక్కలుగా చింపి కిటికీలో నుంచి విసిరి వేశాడు. ఆ కాయితపు ముక్కలు గాలి విసురుకు చెల్లాచెదరై ఎటెటో ఎగిరిపోయాయి.

ఒక అరగంట దాదాపు నిశ్శబ్దంగానే గడిచింది. తర్వాత ఉమాపతి లేచి "నాకు ఆకలి వేస్తున్నది బాబూ,

హోటలుకు వచ్చేవాళ్ళు రావచ్చు...'' అన్నాడు. జోగి నాథం కదలలేదు. లక్ష్మీపతి లేచి చొక్కా తొడుక్కొని "ఉఁ! పోదాం పద..." అన్నాడు.

ఇద్దరూ గదిదాటి బయటికి వచ్చారు. ఉమాపతి ఆగి అనుమానంగా "మనం తప్పు చేస్తున్నా మనిపిస్తున్న దోయ్... అతని సంగతి మనకు తెలుసుకదా! కేవలం అమాయకుడు. ఒకసారి వెళ్ళి 'రమ్మని'ని పిలుద్దాం. రాక పోతే సరే... యిద్దరం వెళ్ళిపోదాం... అప్పుడు మన తప్పేమీ వుండదు'' అన్నాడు.

తర్వాత మళ్ళీ యిద్దరూ లోపలికి వెళ్ళి జోగి నాథాన్ని తట్టి లేపారు. అతడు కళ్ళు తెరిచిచూసి "ఏమి టండీ?'' అని అడిగాడు.

ఉమాపతి "మీరు వచ్చినప్పటి నుంచీ ఎన్నడూ యిలా మేము వేరుగా వెళ్ళలేదు. మీరూ రండి భోజ నానికి..." అన్నాడు.

జోగినాథం కళ్ళలో ఎందుకో నీటిపొర నిలిచింది. అతడు గద్గదస్వరంతో "నాకీపూట ఆకలి లేదండి... నిజం... మీరిద్దరూ వెళ్ళిరండి'' అన్నాడు.

ఉమాపతి అతని నుదుట చేయి ఉంచిచూసి "ఒళ్ళు కొంచెం వేడిగానే ఉంది. అయినా అన్నం మానటం మంచిది కాదేమో!'' అన్నాడు.

జోగినాథం తలవూపి "కాదులెండి... నేనీపూట ఏమీ తినలేను. మీరిద్దరూ వెళ్ళిరండి..." అన్నాడు.

దానితో వారిద్దరూ మరేమీ మాట్లాడకుండా వీధిలోకి వెళ్ళిపోయారు.

జోగినాథానికి ఎందుకో ఏడుపు పొంగి వచ్చింది. అత డింతవరకూ ఎన్నడూ తల్లినీ, చెల్లెళ్ళనూ వొదిలి వున్నవాడు కాదు. ఈ రెణ్ణెల్ల నుంచీ అతను ఎన్నో పర్యాయాలు ఏడుపును దిగమింగుకున్నాడు. కాని యివాళ ఆఫీసులో జరిగిన ఉదంతం అతన్ని కలతపెట్టింది. కాని అతడు దాన్ని అట్టే లెక్కచేయలేదు. దాని తర్వాత కుసుమ యింట్లో జరిగినదంతా అతన్ని చాలా క్షోభ పెట్టింది. తాను నిన్నటినుంచీ చాలా ప్రేమగా కట్టుకున్న పేకమేడలు ఒక్కసారిగా కూలిపోయినట్టయింది. అతడు లోలోపల దుఃఖంతో దిగులుతో మెలికలు తిరిగిపోతూ అలాగే పడుకున్నాడు. అంతలోనే అతనికి గాఢంగా నిద్రపట్టింది.

* * *

అతడు కళ్ళు విప్పిచూసేసరికి రూములో చిన్న బల్బు వెలుగుతున్నది. ఎక్కడా ఏ అలికిడీ లేదు. ఉమాపతి, లక్ష్మీపతి యిద్దరూ గురకలు పెడుతూ నిద్రపోతున్నారు.

అతడు లేచి బల్లమీదవున్న ఉమాపతి రిస్టువాచీ చేతిలోకి తీసుకుని చూశాడు. అయిదు గంటలకు యిరవై నిముషాలు తక్కువ... ఇక కదిలితే మంచిది. తెల్లగా తెల్లవారిన తర్వాత నదికి బయలుదేరి వెళ్ళటం యింక మానుకోవాలి. లేకపోతే వీళ్ళతో చిక్కే... త్వరగా వెళ్ళి వాళ్ళు లేవకముందే రూముకు చేరుకోవడం మంచిది. క్రిందటిరోజు ఆఫీసులో జరిగిన ప్రహసనం మళ్ళీ జరగదని హామీ ఎక్కడా

లేదు కదా ! అతడు త్వరత్వరగా రూము తలుపులు దగ్గరకు లాగి మెట్లు దిగి వీధిలోకి వచ్చాడు. క్రింది మెట్టుదిగుతూ వుండగా ఎందుకో గుండె జలదరించింది.

వీధి చివర ఒక కుక్క అరుస్తున్నది. ఏయింటి పెరటి లోనో దాక్కునివుండి గుడ్లగూబ ఒకటి వుండి వుండి కూత పెడుతున్నది. వీధులలో అక్కడొకరూ, అక్కడొకరుగా జనం పలుచగా తిరుగుతున్నారు.

జోగినాథం మనసులో తనవూరూ, నెర్రెలు విచ్చిన పొలాలూ, రాత్రిళ్ళు నిద్రలేకుండా నీళ్ళు మోస్తూ తిరుగు తున్న తల్లీ పిల్లలూ, నీళ్ళబిందె దొర్లించి చావు దెబ్బలు తిన్న చిన్న చెల్లెలూ, నిస్తేజంగా నీరసంగా వుండేజనమూ, వెచ్చని హోరుగాలీ, రాళ్ళుపగిలే ఎండలూ, గిర్రున సినిమా రీలు లాగ తిరిగిపోయాయి. లోలోపల "నాగార్జునసాగర్ పూర్తిఅయితే మాకూ యీ బాధలు తప్పి బోలెడన్ని నీళ్ళు వస్తాయి" అనుకున్నాడతడు.

నది మెట్ల క్రింద రొద చేస్తూ ప్రవహిస్తున్నది. దూరంగా వంతెన మీద ఏదో రైలు చప్పుడు చేస్తూ పోతు న్నది. చల్లని, జీవంపోసే గాలి హాయిగా తెరలు తెరలుగా వీస్తున్నది. మెట్ల దగ్గర అప్పుడే నలుగురైదుగురు మనుష్యులు స్నానం చేస్తున్నారు. వారిలో ఒకాయన ఏవేవో మంత్రాలు చదువుతున్నాడు. పలుచని వెలుతురు మందంగా వ్యాపిస్తు న్నది.

జోగినాథం చొక్కా విప్పి తువాలు కట్టుకుని నెమ్మ దిగా నీళ్ళలోకి దిగాడు. చల్లని నీళ్ళు మంచులాగా మోకా

ళ్ళకు పైగా తగిలేసరికి శరీరం పులకరించి నట్టయింది. మరొక అడుగుముందుకు వేసి మెట్టు దిగాడు. హాయిగా, "ఎంత బావుంది!" అనుకున్నాడు. మరొక అడుగు ముందుకు... తానిలా హాయిగా మనసు తీరా స్నానం చేస్తూవుంటే తన వూళ్లో తనవారెలా వున్నారో అనే బాధ అతని మనసులోకి వచ్చింది. అమ్మ రాత్రి అంతా నీళ్ళకోసం తిప్పలుపడి యిప్పుడే కొద్దిగా నడుంవాల్చి వుంటుంది...

మరొక మెట్టు క్రిందికి... అతని మనసులో తన వూరూ, తనయిల్లూ, యింటి వెనక ఎండిన పున్నాగ చెట్లూ, పొలాలూ, నీళ్ళులేని బావులూ, అన్నీ మళ్ళీ సినిమారీలులాగా తిరిగిపోయాయి. మళ్లీ "నాగార్జునసాగర్ పూర్తి అయితే మాకూ యిబ్బందులు తప్పుతాయి. అప్పుడు కావలసినన్ని నీళ్ళు" అనుకున్నాడు. మరొక అడుగు ముందుకు వేశాడు. మెట్ల మీద నిలబడ్డవారు ఆందోళనతో అతని వంక చూస్తున్నారు.

అంతలో అతని కాళ్ళు తేలిపోయాయి. అతని గుండెలు ఝల్లు మన్నాయి. అరె! భగవంతుడా! ఏమయి పోతున్నాడు తాను? ఎందుకలా యీ నీళ్ళు తనను లాక్కుపోతున్నాయి? గుండ్రంగా రంగుల రాట్నం తిరిగినట్టవుతున్న దేమిటి? కాళ్ళకు మెట్లు అందవేం? ఆ మనుషులు కనిపించరేం? తన కళ్ళకీ నీళ్ళు అడ్డు వస్తున్నాయెందు చేత?

దూరం నుంచి కేకలు లీలగా వినిపించాయి. నీళ్ళు తన చుట్టూ ఒక గోడ కట్టినట్టుగా ఏర్పడి వొడ్డునున్న వారిని చూసేందుకే వీలు లేకుండా చేశాయి.

అతడు గొంతు పెద్దదిచేసి అరిచాడు. వెంటనే అతని గొంతులోకి నీళ్ళు పోయాయి. రెండవసారి మళ్ళీ అలతో పాటు కొంచెం పైకి వచ్చినందువల్ల కాబోలు అతనికి దూరంగా మనుషులు కనిపించారు. అతడు చేతులెత్తి నమస్కారం చేసి "బాబోయ్ రక్షించండి..." అని అరిచాడు. దానితో మరికాసిని గుటకలు వేశాడు. అతని మనసులో క్షణంలో సగంలో మళ్ళీ సినిమా రీలులోలాగా తనవూరూ, తల్లీ చెల్లెళ్ళూ, నీళ్ళులేని బావులు, నెర్రెలువిచ్చిన పొలాలూ, వెచ్చని హోరుగాలీ... తన స్నేహితులిద్దరూ, కుసుమా, కామేశం... కాంతి వేగంతో మనసులోకి వచ్చి వెళ్ళిపోయారు.

అంతలోనే అతడు మూడవసారి పైకి లేచాడు. మళ్ళీ చేతులెత్తి ఒడ్డున ఉన్నవారి నుద్దేశించి "బాబోయ్! రక్షిం.." అన్నాడు. అంతే. ఆ చేతులు నీరసంగా వాలిపోయాయి. పగబట్టిన పాముల సమూహంలా నీళ్ళు అతన్ని 'రివ్వు'న లోపలికి లాక్కుపోయాయి. కొద్ది క్షణాల్లోనే ఒడ్డున ఉన్నవారికి అక్కడ ఏమీ కనిపించలేదు.

నది తన దోవన తాను భీకరంగా పరవళ్ళుతొక్కుతూ ప్రవహించి పోతున్నది. ఎక్కడో కొన్ని వందలమైళ్ళ దూరంలో మారుమూల పల్లెటూళ్ళో పూరియింట్లో నిద్రలో వున్న తల్లి పేగు కదిలింది.